క్లుప్తంగా

అన్నదాతకు అండగా సీఎం కేసీఆర్



పరామర్శిస్తున్న ఎమ్మెల్యే రసమయి

మానకొండూర్: అన్నదాతలకు అండగా సీఎం కేసీఆర్ నిలిచారని మానకొండూర్ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ అన్నారు. మానకొండూర్ మండలంలోని కొండపల్కలలో ఇటీవల ప్రమాదవశాత్తు మృతిచెందిన రైతు కుటుంబాలను పరామర్శించి సానుభూతి తెలిపారు. దాసరి శ్రీనివాస్ రైతు గుండెపోటుతో మరణించగా, మరో రైతు నల్ల ప్రభాకర్‌రెడ్డి అనారోగ్యంతో ఇటీవల మృతిచెందగా బాధిత కుటుంబాల ఇళ్లకు వెళ్లి రైతుబీమా పథకంలో ఒక్కో కుటుంబానికి రూ.5 లక్షల చొప్పున మంజూరైన ప్రొసీడింగ్ పత్రాలను అందించారు. కొండపల్కల సర్పంచ్ నల్ల వంశీధర్‌రెడ్డి తండ్రి రాంరెడ్డి మృతిచెందగా ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించి సానుభూతి తెలిపారు.

సర్వ్ పీపుల్ సేవలు అభినందనీయం



టీషర్ట్స్ ఆవిష్కరిస్తున్న చైర్మన్ రాజేశ్వర్‌రావు

జమ్మికుంట: సర్వ్ పీపుల్స్ స్వచ్ఛంద సంస్థ సేవలు అభినందనీయమని మున్సిపల్‌చైర్మన్ తక్కళ్లపెల్లి రాజేశ్వర్‌రావు అన్నారు. బుధవారం పట్టణంలో స్వచ్ఛంద సంస్థ సభ్యుల ఆధ్వర్యంలో టీషర్ట్‌లు ఆవిష్కరించి మాట్లాడారు. సమాజంలో సేవభావంతో మరింత ముందుకు సాగాలని, పేదలకు, అనాథలకు సేవలందించడంలో ముందుండాలని కోరారు. స్వచ్ఛంద సేవలను ప్రజలు గుర్తుంచుకునేందుకు టీషర్టులు ప్రచార సాధనంగా ఉంటాయన్నారు. వ్యవస్థాపకుడు రసమయి శేఖర్, సభ్యులు రచ్చకృష్ణ, ఎండీ. రఫీ, ఎండీ. సలీం పాల్గొన్నారు.

విద్యార్థులకు అల్పాహారం



మాట్లాడుతున్న రాజిరెడ్డి

రామడుగు: మండలంలోని వెలిచాల జెడ్పీపాఠశాలలో పదోతరగతి విద్యార్థులకు ఉదయం, సాయంత్రం గ్రామానికి చెందిన దాతలు గాదె నర్సయ్య అల్పాహారం అందించారు. కార్యక్రమానికి హాజరైన జిల్లా బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎర్రం రాజిరెడ్డి హాజరై మాట్లాడుతూ.. విద్యార్థులకు కష్టపడి చదివి ఉన్నతస్థాయికి ఎదగాలని సూచించారు. సర్పంచ్ వీర్ల సరోజన, ఎంపీటీసీ వీర్ల వసంత, హెచ్ఎం విజయ, బండ శకుంతల, రిటైర్డు టీచర్లు వంగ ప్రభాకర్, పర్శారామ్ పాల్గొన్నారు.

68 మందికి కంటి అద్దాలు



కంటిపరీక్షలు చేస్తున్న వైద్యాధికారులు

మానకొండూర్: మండలంలోని చెంజర్ల, మానకొండూర్ గ్రామాల్లో 'కంటివెలుగు' కార్యక్రమం కొనసాగింది. ఈ సందర్భంగా చెంజర్ల గ్రామస్తులు 152 మందికి కంటిపరీక్షలు చేసి 30 మందికి కంటి అద్దాలు అందించారు. మానకొండూర్‌లో 164 మందికి కంటిపరీక్షలు చేసి 38 మందికి కంటిఅద్దాలు అందించారు. డాక్టర్ కిరణ్‌కుమార్, మెడికల్‌ఆఫీసర్ మైథిలి, సీహెచ్‌వో. రాజునాయక్, సూపర్‌వైజర్లు కిషోర్ కుమార్, సరోజన సిబ్బంది పాల్గొన్నారు.

రామడుగులో సీమంతాలు




సీమంతం చేస్తున్న ఐసీడీఎస్ సిబ్బంది

రామడుగు: మండలకేంద్రంలోని శ్రీ విఠలేశ్వర స్వామి ఆలయంలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో బుధవారం గర్భిణులకు సీమంతాలు చేశారు. కార్యక్రమానికి సర్పంచ్ ప్రమీల హాజరై మాట్లాడారు. గర్భిణులు, బాలింతలు, చిన్నారులు పౌష్టికాహారం తీసుకోవాలని అంగన్‌వాడీ కేంద్రాలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ జయప్రద, అంగన్‌వాడీ టీచర్లు సరోజన, అంజలి, లలిత, వసుమతి పాల్గొన్నారు.

కొమిటిపల్లి గుట్ట.. సమస్యల తిష్ట

- కొమిటిపల్లి గుట్టపై నారసింహునికి ఆదరణ కరువు
- అభివృద్ధికి దూరంలో ఆలయం
- ట్రస్ట్ ఆధ్వర్యంలో గుడి నిర్వహణ
- ఆక్రమణకు గురైన గుట్ట భూమిని సంరక్షించాలని భక్తుల విన్నపం



గుట్టపై వెలసిన శ్రీలక్ష్మీనరసింహ స్వామి ఆలయం

ఇల్లందకుంట: మండలకేంద్రానికి 3 కిలోమీటర్ల దూరంలో కొమిటిపల్లి జీపీ పరిధిలోని గుట్టపై వెలసిన నల్లగొండ శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయానికి ఆదరణ కరువైంది. గ్రామంలో నుంచి కొంత దూరం వెళితే ఎత్తైనగుట్టపై వెలసిన గుహలో స్వామివారు వెలిశారు. గర్భగుడిలో శ్రీలక్ష్మీనరసింహ స్వామి ఉత్సవమూర్తులు కొలువుదీరగా శ్రీ నల్లగొండ లక్ష్మీనరసింహస్వామి సేవా ట్రస్ట్ బెంగుళూర్, గ్రామస్తుల ఆధ్వర్యంలో ఆలయ నిర్వహణ కొనసాగుతోంది. శని, ఆది, సోమవారాల్లో భక్తులు ఆలయానికి వచ్చి స్వామివార్లను దర్శించుకుంటారు. నిత్యపూజలతో పాటు ప్రతీ మంగళవారం రాహు కేతు పూజలు నిర్వహించడం ఇక్కడ ప్రత్యేకం.

అందమైన ప్రకృతి:
సర్వే నెం.120లో సుమారు 67 ఎకరాల విస్తీర్ణంలో గుట్ట ఆవరించి రెండు కొండల మధ్య చుట్టూ పచ్చని చెట్లు మనసుకు హాయి కలిగించేలా ప్రశాంతమైన వాతావరణం. కొండపై నుంచి చూస్తే కనుచూపు మేరా పచ్చని పంట పొలాలు ప్రకృతి అందాల మధ్య ఎత్తైన గుట్టపై కొలువైన నరసింహ స్వామి ఆలయం ఎంతో చూడముచ్చటగా ఉంటుంది. కానీ పట్టించుకునే వారు లేక అనాదిగా ఆదరణ కరువై అభివృద్ధికి ఆమడ దూరంలో ఉంది. అధికారులు హరితహారంలో భాగంగా గుట్టపరిధిలో నాటిన మొక్కలకు నీళ్లుపట్టేవారు లేక ఎండిపోతున్నాయి. ఆక్రమణకు గురైన గుట్ట భూమిని సర్వేచేసి హద్దులు నిర్ణయించి ఆలయ భూమిని సంరక్షించాలని అధికారులను గ్రామస్తులు కోరుతున్నారు.

సుదూర ప్రాంతాల నుంచి స్వామివారి సేవకు
ఆలయంలో ఉత్సవ మూర్తులను దర్శించుకునేందుకు బెంగళూర్, హైదరాబాద్, వరంగల్, కరీంనగర్ వంటి సుదూర ప్రాంతాల నుంచి భక్తులు వచ్చి స్వామివారికి మొక్కులు చెల్లించి వనభోజనం చేసి వెళ్తుంటారు. మిగతా రోజుల్లో సైతం చుట్టుపక్కల గ్రామాలు, మండలాల నుంచి కుటుంబాలతో వచ్చి ఉదయం నుంచి సాయంత్రం వరకు సంతోషంగా గడిపి వెళ్తుంటారు. గుట్టకింద విశాలమైన ప్రదేశంలో వివిధ రకాల పూలు, పండ్ల తోటలు నాటారు. గుట్ట చుట్టూ ప్రాంతం ఏపుగా పెరిగిన పలురకాల చెట్లతో చిట్టడవిని తలపిస్తుంది.

ఆదరణ కరువు..
ఏళ్ల చరిత్ర గల ఈ ఆలయాన్ని ఎవరూ పట్టించుకోక కనీస వసతులు కల్పించక భక్తులు గుడికి రావడానికి ఇబ్బందులు పడుతున్నారు. ఈ ఆలయాన్ని దేవాదాయధర్మదాయశాఖ పరిధిలోకి తీసుకొచ్చి గుట్టను అభివృద్ధి చేయాలని పలువురు కోరుతున్నారు. గతంలో మంత్రిగా ఉన్న సమయంలో ప్రస్తుత హుజురాబాద్ ఎమ్మెల్యే ఈటల రాజేందర్ పలుమార్లు ఆలయాన్ని దర్శించుకొని ఎండోమెంట్ ద్వారా గుడి అభివృద్ధి చేస్తానని తెలిపిన ఫలితం లేకుండా పోయింది.

వసతులు లేవు...



దాతల సాయంతో గతంలో కల్యాణ మండపం పనులు ప్రారంభించి మధ్యలోనే నిలిచాయి. పనులు పూర్తిచేయాల్సి ఉంది. గతంలో దాతల సహకారంతో కొంత అభివృద్ధి జరిగింది. పాలకులు, దాతలు గుట్టను అభివృద్ధి చేస్తే ఆధ్యాత్మిక కేంద్రంతో పాటు పర్యాటక కేంద్రంగా రూపుదిద్దుకుంటుంది.

– చిట్ల కుమారస్వామి, ఆలయకమిటీ చైర్మన్, కొమిటిపల్లి

ఆలయ అభివృద్ధికి సహకరించాలి



ఆలయానికి దాతలు విరాళం అందించి అభివృద్ధికి సహకరించాలి. కొండపైకి వాటర్ పైపులైన్ వేశారు. కానీ తాగునీరు లేక భక్తులు ఇబ్బందులు పడుతున్నారు. గుట్ట పైకి సీసీ రోడ్డు నిర్మించాలి. ఈ ఆలయానికి భక్తులు రద్దీ మరింత పెరగడానికి మౌలిక వసతులు కల్పించాలి.

– తెల్ల వర్షుల ప్రదీప్‌శర్మ ఆలయ అర్చకుడు

సుకన్య సమృద్ధి యోజన డబ్బులు స్వాహా

- సహాయకుడితో కలిసి కాజేసిన వీబీపీఎం
- వెన్నంపల్లి పోస్టాఫీసు ఎదుట బాధితుల ఆందోళన
- ఖాతాల్లో డబ్బులు జమచేయాలని డిమాండ్



పోస్టాఫీస్ ఎదుట బాధితులు

సైదాపూర్(హుస్నాబాద్): సుకన్య సమృద్ధి యోజన పథకంలో సోమారం, వెన్నంపల్లి, ఆరెపల్లి లస్మన్నపల్లి గ్రామస్తులతో రూ.250లతో వెన్నంపల్లి పోస్టాఫీసు వీబీపీఎం మాడ చంద్రారెడ్డి ఖాతాలు తెరిపించాడు. తనకు సహాయకుడిగా కనకం సందీప్‌ను నియమించుకున్నాడు. అతను నెలనెలా ఖాతాదారుల నుంచి డబ్బులు వసూలు చేశాడు. కానీ వాటిని పోస్టాఫీసులో చెల్లించకుండా ఇద్దరూ కాజేశారు. అనుమానం వచ్చిన బాధితులు ఒక్కొక్కరుగా వచ్చి ఆరా తీస్తే అసలు విషయం బయటపడింది. దీంతో పలువురు బుధవారం వీబీపీఎం చంద్రారెడ్డిని నిలదీశారు. తమ ఖాతా బుక్కులు ఇవ్వాలని, డబ్బులు వాటిల్లో జమచేసినట్లు రాయాలని అడగడంతో ప్రీమియం డబ్బులు పోస్టాఫీసులో జమ కాలేదని తేలింది. డబ్బులను సందీప్ వాడుకున్నాడని తనకు ఇవ్వలేదని చంద్రారెడ్డి తెలిపాడు. అధికారులు స్పందించి, ప్రీమియం సొమ్ము మింగిన వారిపై చర్యలు తీసుకొని, డబ్బులు ఇప్పించాలని ఖాతాదారులు కోరారు. బాధితులు ఎంతమంది, మొత్తం ఎన్ని డబ్బులు స్వాహా అయ్యాయో తెలాల్సి ఉంది.

రూ.10 వేలు జమ చేయలేదు



నాకు భర్త లేడు. ఇద్దరు ఆడ పిల్లలున్నారు. చికెన్ సెంటర్ నడుపుతున్న. పోస్టాఫీసులో నా బిడ్డ రోషిణి పేరిట రూ.250లతో సుకన్య సమృద్ధి యోజన ఖాతా తెరిచాను. సందీప్ నెలనెలా వచ్చి, రూ.1,000 తీసుకెళ్లాడు. ఇలా 10 నెలలు చెల్లించాను. పోస్టాఫీసుకు వెళ్లి, ఆరా తీస్తే ఖాతా తెరిచినప్పుడు చెల్లించిన రూ.250 మాత్రమే కట్టినట్లు ఉంది. రూ.10 వేలు జమ చేయలేదు. అధికారులు స్పందించి, నా డబ్బులు ఇప్పించాలి.

– గూడెల్లి కోమల, సోమారం

చికిత్సపొందుతూ వ్యక్తి మృతి



భద్రయ్య (ఫైల్)

జమ్మికుంట: గుర్తు తెలియని బైక్ ఢీకొని తీవ్రగాయలై చికిత్సపొందుతూ ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన బుధవారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని మడిపల్లికి చెందిన జన్నే భద్రయ్య(73) వ్యవసాయ పనుల నిమిత్తం ఈనెల 20న కనగర్తి రోడ్డు నుంచి ఇంటికి తిరిగి వస్తుండగా, మడిపల్లి గ్రామ సమీపంలో గుర్తుతెలియని వ్యక్తి బైక్‌తో ఢీకొట్టి వెళ్లాడు. దీంతో బైక్‌పై నుంచి కిందపడడంతో తలకు తీవ్రగాయాలు కాగా చికిత్సనిమిత్తం వరంగల్ ఎంజీఎం ఆస్పత్రికి తరలించగా చికిత్సపొందుతూ మృతి చెందాడు. మృతుడికి ఇద్దరు కొడుకులు, కుతురు ఉన్నారు. మృతుడి భార్య ఐలమ్మ ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు జమ్మికుంట టౌన్ సీఐ రామచందర్‌రావు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఇరువురికి గాయాలు
తిమ్మాపూర్: మండలంలోని రామకృష్ణకాలనీ స్టేజ్‌పై బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు గాయపడ్డారు. సుభాష్‌నగర్‌కు చెందిన నూనె రాజు, అట్ల అజయ్ బైక్‌పై నుస్తులాపూర్‌కు బయల్దేరారు. రామకృష్ణకాలనీ స్టేజ్‌వద్ద రోడ్డు దాటుతుండగా రోడ్డుపై వెళ్తున్న ట్యాంకర్‌ను ఢీకొట్టారు. ఈ ప్రమాదంలో ఇద్దరు తలలకు తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు ఇరువురిని ఆసుపత్రికి తరలించారు.

ఓటర్స్‌డే వేడుకలు

గన్నేరువరం: లయన్స్ క్లబ్ ఆఫ్ గన్నేరువరం ఆధ్వర్యంలో నేషనల్ ఓటర్స్ డే సందర్భంగా గన్నేరువరంలోని ప్రభుత్వ పాఠశాలలో ప్రతిజ్ఞ చేసి, స్కూల్ యాజమాన్యం నిర్వహించిన చిత్రలేఖనం పోటీలో విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ బావ్‌సింగ్, సర్పంచ్ పుల్లల లక్ష్మీ, వైస్ ఎంపీపీ న్యాత స్వప్న, లయన్స్ క్లబ్ అధ్యక్షుడు బొడ్డు సునీల్, ఉపసర్పంచ్ బూర వెంకటేశ్వర్, హైస్కూల్ ఇన్‌చార్జీ హెచ్ఎం శరత్‌కుమార్, ప్రైమరీ స్కూల్ హెచ్ఎం రావు, బూర శ్రీనివాస్, ఎల్లయ్య, భాస్కర్ పాల్గొన్నారు.

ఎమ్మెల్యే ఈటలపై ఈసీ చర్య తీసుకోవాలి



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ కౌశిక్‌రెడ్డి

జమ్మికుంట(హుజూరాబాద్): హుజూరాబాద్ ఉపఎన్నికలో రూ.40 కోట్ల నుంచి రూ.100 కోట్ల వరకు ఖర్చుపెట్టి, గెలిచానని ఎమ్మెల్యే ఈటల రాజేందర్ మీడియా ముందు మాట్లాడారని, ఆయనపై ఎలక్షన్ కమిషన్(ఈసీ) చర్యతీసుకోవాలని ఎమ్మెల్సీ పాడి కౌశిక్‌రెడ్డి డిమాండ్ చేశారు. జమ్మికుంట పట్టణంలోని ఎంపీఆర్ గార్డెన్స్‌లో బుధవారం బీఆర్ఎస్ కార్యకర్తల సమావేశం నిర్వహించి మాట్లాడారు. ఎలక్షన్ కమిషన్ నిబంధనల ప్రకారం ఒక ఎమ్మెల్యే అభ్యర్థి రూ.30 లక్షలకు మించి ఖర్చు పెట్టరాదని తెలిపారు. ఈటల శాసన సభ్యత్వాన్ని రద్దు చేయాలని, ఆయనపై క్రిమినల్ కేసుపెట్టాలని కోరతామన్నారు. ఈటల రాజేందర్ గెలిచి ఏడాది గడిచినా హుజూరాబాద్ నియోజకవర్గంలో తట్టెడు మట్టి కూడా పోయలేదని పేర్కొన్నారు. ఈనెల 31న జమ్మికుంట ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానంలో 50 వేల మందితో మంత్రి కేటీఆర్ బహిరంగ సభ ఉంటుందని, పలు అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభిస్తారని అన్నారు. రాష్ట్ర ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ బండ శ్రీనివాస్, డీసీసీబీ వైస్ చైర్మన్ పింగిళి రమేశ్, జెడ్పీటీసీ సభ్యుడు శ్రీరామ్‌శ్యాం, సీనియర్ నాయకులు దేశిని కోటి, రంజిత్, రమేశ్ పాల్గొన్నారు.

ఓటుహక్కు వినియోగించుకోవాలి

హుజూరాబాద్/శంకరపట్నం/ఇల్లందకుంట: ఓటుహక్కును ప్రజలు వినియోగించుకోవాలని తహసీల్దార్ శ్రీనివాస్‌రావు అన్నారు. శంకరపట్నం తహసీల్దార్ కార్యాలయం ఎదుట జాతీయ ఓటరు దినోత్సవం సందర్భంగా ప్రతిజ్ఞ చేయించారు. వృద్ధులను సన్మానించారు. ఇల్లందకుంట రెవెన్యూ కార్యాలయంలో తహసీల్దార్ మాధవితాగూర్ ఆధ్వర్యంలో జాతీయ ఓటరు దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ ఓటుహక్కు విశిష్టతను వివరిస్తూ సిబ్బందిచే ప్రతిజ్ఞ చేయించారు. శ్రీవాగ్దేవి డిగ్రీ కళాశాలలో జాతీయ ఓటర్ దినోత్సవాన్ని కళాశాల కరస్పాండెంట్ ఏనుగు మైపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు.

ఆర్ఎంపీ అసోసియేషన్ జిల్లా అధికార ప్రతినిధిగా భీమన్న



సన్మానిస్తున్న జెడ్పీచైర్‌పర్సన్ విజయ

జమ్మికుంట: కరీంనగర్ జిల్లా ఆర్ఎంపీ, పీఎంపీల వెల్ఫేర్ అసోసియేషన్ అధికార ప్రతినిధిగా మున్సిపల్ పరిధిలోని ధర్మారానికి చెందిన పైడిపల్లి భీమన్నను నియమించినట్లు జిల్లా అధ్యక్షుడు కాసం రవీందర్‌రెడ్డి తెలిపారు. బుధవారం జిల్లాకేంద్రంలో ఆర్ఎంపీ, పీఎంపీ వెల్ఫేర్ అసోసియేషన్ నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జెడ్పీచైర్‌పర్సన్ కనుమల్ల విజయ హాజరై భీమన్నను శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా భీమన్న మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంతంలో వైద్యసేవలు అందిస్తున్న ఆర్ఎంపీ, పీఎంపీల సమస్యల పరిష్కరానికి కృషిచేస్తానన్నారు. తన నియామకానికి సహకరించిన రాష్ట్ర అధ్యక్షుడు దొంతుల మనోహర్, జిల్లా ప్రధాన కార్యదర్శి చెన్నమదవుని నర్సింహరాజు, కంకణాల ప్రభాకర్‌రెడ్డి కి కృతజ్ఞతలు తెలిపారు.

మున్నూరు కాపు యువజన సంఘం ఎన్నిక

గన్నేరువరం: మున్నూరుకాపు యువజన సంఘం నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు గన్నేరువరం మున్నూరుకాపు సంఘం మండల కోఆర్డినేటర్ బొడ్డు సునీల్ తెలిపారు. అధ్యక్షుడిగా పెర్క తిరుపతి, ప్రధానకార్యదర్శిగా కయ్యం శ్రీకాంత్, ఉపాధ్యక్షులుగా మంగరావు సాయికుమార్, సైండ్ల సాయి, కోశాధికారిగా మంగరావు కృష్ణకాంత్, కార్యదర్శిగా మంగరావు అరుణ్‌సాయి, సహాయ కార్యదర్శులుగా దొగ్గలి రాజు, బొడ్డు మహేశ్, బొడ్డు రాకేశ్, కొలుపుల అనిల్, కార్యవర్గ సభ్యులును ఎన్నుకున్నారు.

ప్రమాదవశాత్తు కాలుజారి కెనాల్‌లో పడి..



రమేశ్ మృతదేహం

హుజూరాబాద్‌రూరల్: ప్రమాదవశత్తు కాలుజారి కెనాల్‌లో పడి వ్యక్తి మృతిచెందిన ఘటన బుధవారం చోటుచేసుకుంది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం... మండలంలోని తుమ్మనపల్లికి చెందిన కాశిరెడ్డి చిరంజీవి రైతుకు చెందిన పొలం దగ్గర్లోని కెనాల్‌లో సాయంత్రం వ్యక్తి మృతదేహం నీటిలో తేలియాడుతుండగా గమనించి పోలీసులకు సమాచారం అందించాడు. వెంటనే పోలీసులు ఘటన స్థలానికి వెళ్లి మృతదేహాన్ని కెనాల్ నుంచి బయటకు తీశారు. మృతుడి జేబులో ఆధార్‌కార్డు ఆధారంగా వరంగల్ జిల్లా ఖానాపూర్ మండలం దబిడిపేట గ్రామానికి చెందిన బొమ్మకంటి రమేశ్‌గా గుర్తించారు. మృతుడు బోర్‌వెల్ నిర్వాహకుడు గొలుసుల మోహన్‌బాబు దగ్గర పనిచేస్తాడని ఇతనితో పాటు క్రిష్ణన్ కుమార్ గుప్తా అనే వ్యక్తి కూడా పనిచేస్తాడన్నారు. మృతుడు మద్యంతాగి కాలుజారీ కెనాల్‌లో పడి మృతిచెంది ఉంటాడని రైతు కాశిరెడ్డి చిరంజీవి దరఖాస్తు ఇవ్వగా కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రాజన్న తెలిపారు. మృతదేహాన్ని హుజూరాబాద్ ఏరియా ఆసుపత్రి మార్చురీకి తరలించనట్లు పోలీసులు తెలిపారు.

కిట్స్‌కు న్యాక్ ఏ ప్లస్ ప్లస్ గ్రేడ్ గుర్తింపు

- అధ్యాపకుల కృషి, విదార్థుల నైపుణ్యం
- కళాశాల ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ వొడితల ఇంద్రనీల్



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ శంకర్

హుజూరాబాద్‌రూరల్: కిట్స్ కళాశాలకు నాక్ ఏ ప్లస్ ప్లస్ గ్రేడ్ రావడం గర్వకారణమని, నాణ్యమైన విద్యకు మారుపేరుగా కళాశాల నిలవడం గొప్ప విషయమనీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ వొడితల ఇంద్రనీల్ అన్నారు. బుధవారం మండలంలోని సింగాపూర్ కిట్స్ ఇంజినీరింగ్ కళాశాల ఆడిటోరియంలో ప్రిన్సిపాల్ డాక్టర్ కందుకూరి శంకర్ అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమానికి హాజరై మాట్లాడారు. న్యాక్ ప్రకటించిన ఫలితాల్లో కిట్స్ కళాశాలకుఏ ప్లస్ ప్లస్ గ్రేడ్ సాధించిందన్నారు. నిష్ణాతులైన అధ్యాపకులు, కష్టపడి చదివే విద్యార్థుల కృషితో ఈ ఫలితం సాధ్యమైందన్నారు. విద్యార్థులకు ఉద్యోగావకాశాలు కల్పించేందుకు టీసీఎస్, ఇన్ఫోసిస్, విప్రో, ఐబీఎం వంటి కార్పొరేట్ సంస్థలు ముందుకు వస్తున్నాయన్నారు. టాస్క్ ఆధ్వర్యంలో విద్యార్థుల్లో నైపుణ్యం పెంపొందించేందుకు శిక్షణ అందిస్తున్నామన్నారు. అనంతరం కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కందుకూరి శంకర్ మాట్లాడుతూ... విద్యార్థుల్లో నైపుణ్యం పెంపొందించేందుకు అన్నిసౌకర్యాలు కల్పిస్తున్నామన్నారు. విద్యార్థులకు కావాల్సిన ల్యాబ్స్, ప్రయోగశాలలు, ప్రాజెక్ట్ వర్క్‌ల్లో ప్రతిభ కనబర్చి గుర్తింపు తెచ్చుకుంటున్నారన్నారు. కార్యక్రమంలో రిజిస్టర్ పీ వెంకటయ్య, నాక్ సమన్వయ కర్త డాక్టర్ వి.రాజేశ్వరరావు, ఎన్‌సీసీ అధికారి డాక్టర్ కల్లెం రవీంద్రబాబు, వివిధ విభాగాల అధిపతులు, ఆఫీస్ ఇన్చార్జిలు, బోధన సిబ్బంది పాల్గొన్నారు.

పోస్టాఫీస్ సేవలు వినియోగించుకోవాలి

- పెరిగిన వడ్డీ రేట్లు
- సబ్ డివిజన్ పోస్టల్ ఇన్‌స్పెక్టర్ అరికాల నరేశ్
- జమ్మికుంట పోస్టల్ ఎంప్లాయిస్, తపాలా ఏజెంట్లతో సమావేశం



మాట్లాడుతున్న పోస్టల్ అధికారులు

జమ్మికుంట: పోస్టాఫీస్‌లో చిన్నమొత్తాల పొదుపు వడ్డీరేట్లు భారీగా పెరిగాయాని, వినియోగదారులు పెరిగిన వడ్డీరేట్లను సద్వినియోగం చేసుకోవాలని జమ్మికుంట సబ్‌డివిజన్ పోస్టల్ ఇన్‌స్పెక్టర్ అరికాల నరేశ్ అన్నారు. బుధవారం పట్టణంలో పోస్టల్ ఎంప్లాయిస్, తపాలా ఏజెంట్లతో సమావేశం నిర్వహించి మాట్లాడారు. జమ్మికుంట, ఉప్పల్, కమాలాపూర్ పోత్కపల్లి, ఉటూరు, వీణవంక పరిసర గ్రామాల పోస్టాఫీసుల్లో ప్రత్యేక కౌంటర్ ఈనెల 31వరకు అందుబాటులోకి వస్తాయని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో పోస్ట్‌మాస్టర్ బత్తిని రాజ్‌కుమార్, పోస్టల్ అసిస్టెంట్ ప్రవీణ్, నరేశ్, విద్యాసాగర్, బీపీఎంలు, ఏబీపీఎంలు, ఏజెంట్లతో పాటు తదితరులు పాల్గొన్నారు.

ఏసీడీ చార్జీలు తగ్గించాలి



వినతి పత్రం ఇస్తున్న కాంగ్రెస్ నాయకులు

జమ్మికుంట: ప్రభుత్వం పెంచిన విద్యుత్ ఏసీడీ చార్జీలను వెంటనే తగ్గించాలని పట్టణ మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు పూదరి రేణుక అన్నారు. బుధవారం పట్టణంలోని విద్యుత్ ఏఈకి వినతిపత్రం అందించి మాట్లాడారు. పేద మధ్యతరగతి కుటుంబాలపై కరెంటు చార్జీలు భారంగా మారాయన్నారు. అధిక చార్జీలు కట్టలేని స్థితిలో పేదప్రజలు ఉన్నారని ఏసీడీ పేరిట పేదలను మరింత దోచుకుంటున్నారని మండిపడ్డారు. బిల్లులు తగ్గించకపోతే రానున్న రోజుల్లో కార్యచరణ రూపొందించి కాంగ్రెస్ ఆధ్వర్యంలో ఆందోళనలు చేపడుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు మనుపాటి సూర్య, పూదరి శివకుమార్‌గౌడ్, చిట్యాల శంకర్, చింత హరీశ్‌రెడ్డి, ఈరెల్లి శ్రీధర్ పాల్గొన్నారు.

కెనాల్ పనుల పరిశీలన



పనులు పరిశీలిస్తున్న ఇంజనీరింగ్ అధికారులు

సైదాపూర్: కరీంనగర్ మిడ్ మానేర్ కుడికాలువ నుంచి వరద కాలువ ద్వారా మండలానికి ఇప్పటి వరకు తవ్విన పాత కాలువల పనులను బుధవారం ఇరిగేషన్ ఇంజినీరింగ్ అధికారులు పరిశీలించారు. కాలువల్లో పూడిక తీత పనులు పూర్తిచేసి, ఫిబ్రవరిలో సాగునీరు అందేలా కృషిచేస్తున్నట్లు ఈఈ రమేశ్ తెలిపారు. దుద్దెనపల్లి వరకు వచ్చిన కాలువ నీళ్లను సైదాపూర్, జాగీర్‌పల్లి, ఎల్లంపల్లి, గొడిశాల ద్వారా మండలవ్యాప్తంగా సాగునీరందుతుందన్నారు. కార్యక్రమంలో జాగీర్‌పల్లి సర్పంచ్ తొంట కాంతమ్మ, డిప్యూటీ ఈఈ శంకర్, ఏఈ ఆంజనేయులు, రజినీకాంత్ తదితరులు ఉన్నారు.

ఇసుక టిప్పర్ల పట్టివేత



పట్టుబడిన టిప్పర్లతో ఎస్సై తిరుపతి

ఇల్లందకుంట: మానేరు వాగునుంచి ఎలాంటి అనుమతులు లేకుండా అక్రమంగా ఇసుక తరలిస్తున్న టిప్పర్లను మంగళవారం అర్ధరాత్రి హెచ్‌పీ పెట్రోల్ బంకు సమీపంలో పోలీసులు పట్టుకున్నారు. ఎస్సై తోట తిరుపతి ఆధ్వర్యంలో అర్ధరాత్రి పెట్రోలింగ్ నిర్వహిస్తున్న క్రమంలో జయశంకర్ భూపాలపల్లి జిల్లా రేగొండకు చెందిన పల్లెబోయిన అజయ్ (డ్రైవర్) కుర్రి చిరంజీవి(డ్రైవర్), నడిపెల్లి శ్రీనివాసరావుకు (ఓనర్) చెందిన రెండు టిప్పర్లను పట్టుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

బాలుడి కోరిక మేరకు అభివృద్ధి పనులు ప్రారంభం

గంగాధర: తమ వీధికి సీసీ రోడ్డు వేయాలన్న ఓ విద్యార్థి కోరికను నెరవేర్చి అతని చేతులమీదుగానే పనులు ప్రారంభించాడు ఎమ్మెల్యే సుంకె రవిశంకర్. మండలంలోని సర్వారెడ్డిపల్లికి చెందిన ముద్దం యశ్వంత్ చిన్నారి ఎమ్మెల్యేకు ఫోన్‌చేసి తమ వీధికి సీసీ రోడ్డువేయించాలని కోరాడు. స్పందించిన ఎమ్మెల్యే సీసీరోడ్డు నిర్మాణానికి రూ.4.60 లక్షలు, మరో సీసీరోడ్డు నిర్మాణానికి రూ.5 లక్షలు, శ్మశాన వాటిక పనపులకు రూ.12.60 లక్షల మంజూరు చేసి బుధవారం పనులు ప్రారంభించారు.